క్లుప్తంగా

పరామర్శ

సంగం: మండలంలోని చెన్నవరప్పాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేట మల్లికార్జున భార్య మల్లేశ్వరి (37) అనారోగ్యంతో నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం సందర్శించి నివాళులర్పించారు. మల్లికార్జున కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాగా మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఫోన్‌లో మల్లికార్జునను పరామర్శించి ఓదార్చారు.

ముమ్మరంగా శనగ నూర్పిళ్లు



దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు, బోడవారిపల్లి, లక్ష్మీపురం, కమ్మవారిపాళెం, నర్రవాడ, బ్రహ్మేశ్వరం, తదితర గ్రామాల్లోని రైతులు శనగ నూర్పిళ్లు ముమ్మరంగా చేపడుతున్నారు. ముందుగా శనగ పంటను కోసి ఎండబెట్టి యంత్రం సాయంతో నూర్పిళ్లు చేపడుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడులు పెరిగాయి. దిగుబడులు తగ్గడంతో పెట్టుబడులు వస్తాయో..రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జిలానీ

ఆత్మకూరు: పట్టణంలోని సోమశిల రోడ్ సెంటర్‌లో కారు పార్కింగ్ వద్ద బుధవారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందజేయగా ఎస్సై షేక్ జిలానీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బండారుపల్లి గిరిజనకాలనీకి చెందిన మనోహర్‌గా (38) గుర్తించారు. స్థానికులను విచారించగా అతిగా మద్యం సేవించి మృతి చెంది ఉండొచ్చని తెలిపారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు. అతిగా మద్యం సేవించడం వల్ల లేక మరేదైనా కారణంతో మృతి చెందాడా అన్న విషయాన్ని విచారణలో తేలుస్తామని పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



అల్లూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దేవిరెడ్డి శారద వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో మంచి సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం రక్త దాతలను అభినందించారు. డీఎంహెచ్‌ఓ సుజాత, వైద్యులు కే వెంకటేశ్వర్లు, నవీన్, సింధూజ, రమేష్, ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, మేనేజర్ అనిల్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్డు



దుత్తలూరు: దుత్తలూరు సెంటర్ నుంచి దుత్తలూరు గ్రామానికి వెళ్లే రోడ్డుపై పూర్తిగా గుంతలమయంగా తయారైంది. ఇటీవల నర్రవాడకు మంత్రులు వస్తున్నారనే సమాచారంతో అధికారులు తాత్కాలికంగా కంకర, బూడిద పోసి మరమ్మతులు చేపట్టారు. దానిపై తారు వేయకపోవడంతో కొద్దిరోజులకే కంకర తేలి దుమ్ము లేస్తుండడంతో వాహనదారులు చుక్కలను చూస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు కంకర వల్ల అదుపుతప్పి పడిపోతూ గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సర్వం..శివనామస్మరణ



చేజర్ల: విద్యుద్దీప కాంతుల్లో కోటితీర్థం క్షేత్రం



ఆత్మకూరు శివాలయంలో భక్తుల క్యూ



దుత్తలూరు: విశేషాలంకారంలో రామలింగేశ్వరస్వామి

మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. పరమశివుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో శైవక్షేత్రాలు పులకించాయి. కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాల్లో ఆది దంపతులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

కావలి: పట్టణంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో శివాలయం కిటకిటలాడింది. భక్తుల శరణు ఘోషతో శివాలయం పరిసరాలు పులకించాయి. కాగా కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శివాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే ఏకాదశ రుద్రాభిషేకం, విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వేశ్వరస్వామి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉదయం 11.30 గంటల సమయంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో విశేషంగా అలంకరించిన ఆదిదంపతుల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని బీఎస్సార్ కుటుంబీకులు జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కల్యాణోత్సవానికి ఉభయకర్తలుగా ఎస్‌ఆర్‌ఐలు మైథిలి, కార్తికేయరెడ్డి దంపతులు వ్యవహరించారు. ముత్యాల తలంబ్రాలను పుచ్చలపల్లి వెంకటేశ్వరరెడ్డి అందజేశారు. కౌన్సిలర్ రాధిక, రవీంద్రారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. కాశీనాయన ఆశ్రమంలోని దుర్గామల్లేశ్వరస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. బైపాస్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు చెంచురత్నం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరులోని సిద్దేశ్వరస్వామి ఆలయం, కలిగిరిలోని పర్వవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, అగ్రహారంలోని కాలభైరవస్వామి ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. సిద్ధనకొండూరులోని సిద్దేశ్వరస్వామి ఆలయం, అగ్రహారంలో కాలభైరవస్వామి ఆలయాల వద్ద భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి శివరాత్రి జాగారం చేసేభక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కలిగిరిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సోమశిల: అనంతసాగరం మండలంలోని శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆదిదంపతులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే చిలకలమర్రి సమీపంలో కొలువై ఉన్న మల్లెం కొండేశ్వరస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శివరాత్రి జాగారం చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. భక్తులకు భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. వడ్డిపాళెంలోని శివాలయం వద్ద గ్రామానికి చెందిన దేవల రమణయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

జలదంకి: బ్రాహ్మణక్రాకలోని శివాలయం, చినక్రాకలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, జలదంకిలోని జానకీ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు, కల్యాణోత్సవాలను నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవాలు, తెప్పోత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాత్రి లింగోద్భకాలంలో అభిషేకాలు చేపట్టారు. రాత్రి జాగారం చేసే భక్తుల కోసం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సీతారామపురం: మండలంలోని ప్రాచీన శైవక్షేత్రాలైన ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, రామయ్యస్వామి ఆశ్రమాలు భక్తులతో కిటకిటలాడియి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి జాగారం చేశారు. భక్తులకు భారీస్థాయిలో అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సిద్దేశ్వరం క్షేత్రాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయగిరి సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

సంగం: సంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయం, తిరుమనకొండపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, వంగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయం, దువ్వూరులోని గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. దువ్వూరులో గంగా,పార్వతి సమేత కోటేశ్వరస్వామికి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. వంగల్లులో కామాక్షిదేవి అమ్మవారు వెన్నపూస అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది.

అల్లూరు: మండలంలోని నార్తుమోపూరులోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి తిక్కవరపు మధుమోహన్‌రెడ్డి, సంధ్య, అభిషేకానికి బుర్రి మల్లికార్జున, శివయ్య, విష్ణు, బాలకృష్ణారెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఉదయగిరి: ఉదయగిరిలోని శివపార్వతుల ఆలయం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, గండిపాళెంలోని శివాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వింజమూరులోని శివాలయం, చెన్నకేశవస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి జాగారం చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమనలోని కామాక్షిదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మర్రిపాడు: మండలంలోని నందవరంలోని విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భీమవరం సొసైటీ మాజీ చైర్మన్, రైల్వే కాంట్రాక్టర్ ఎర్రమళ్ల చిన్నారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జడ్జి శిల్పాతో పాటు మరో 8 మంది జడ్జిలు పాల్గొన్నారు.

దుత్తలూరు: స్థానిక సంజీవకొండపై కొలువైన రామలింగేశ్వరస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రామలింగేశ్వరుని ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండదిగువన శివపార్వతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆదిదంపతుల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.


చేజర్ల: కోటితీర్థం క్షేత్రంలో కొలువైన కామాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామికి మహారుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆదిదంపతులను దర్శించుకుని పూజలు చేశారు.



కావలి శివాలయంలో బారులు తీరిన భక్తులు




కావలి: విశేషాలంకారంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి



అల్లూరు: నార్తుమోపూరులో శివపార్వతుల కల్యాణం



సోమశిల: మల్లెంకొండేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సంగం: వంగల్లులో కామాక్షిదేవి మూలవిరాట్టుకు వెన్న అలంకారం



దుత్తలూరు: రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం



రామలింగేశ్వరుని దర్శించుకున్న ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల, కావ్య



మర్రిపాడు: నందవరంలో విశాలక్షి, విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం



సీతారామపురం: సిద్ధేశ్వరంలోని నాగశిలల వద్ద పూజలు చేస్తున్న భక్తులు



శివాలయంలో పూజలు చేస్తున్న రామిరెడ్డి



సంగంలోని సంగమేశ్వరాలయంలోభక్తజన కోలాహలం



కలిగిరిలోని సిద్ధేశ్వరాలయంలో భక్తుల సందడి

భూ ఆధార్‌పై కౌలురైతుల్లో అలజడి

సొంత భూమి కలిగిన రైతులకే భూఆధార్‌ను జారీ చేయాలని కేంద్రం ఆదేశించడంతో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. భవిష్యత్తులో వ్యవసాయ సంక్షేమ పథకాలను పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతుండడంతో కౌలురైతుల్లో అలజడి నెలకొంది. భవిష్యత్తులో తమకు సంక్షేమ పథకాలు అందవేమోనని వారు ఆందోళన చెందుతున్నారు.



సీతారామపురంలో భూ ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

సీతారామపురం : సొంత భూములు కలిగిన రైతులకు మాత్రమే అందజేస్తున్న భూ ఆధార్ కౌలు రైతుల పాలిట శాపంగా మారనుంది. తమ గుర్తింపునకు గండి కొట్టేలా ఉన్న భూ ఆధార్‌తో తమకు నష్టం వాటిల్లుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. సాగుదారుల సంక్షేమం కోసం చేసిన చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయన్న అనుమానం కౌలుదారుల్లో నెలకొంది. సొంత భూమి గల భూ యజమానులకు 11 అంకెల విశిష్ట సంఖ్యతో భూ ఆధార్ కార్డులను జారీ చేయాలని కేంద్రం ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా నమోదు చేపడుతోంది. ప్రధాన మంత్రి కిసాన్ ఫసల్ బీమాతో పాటు బ్యాంకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, తదితర సంక్షేమ పథకాలకు భూ ఆధార్ తప్పనిసరిని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కౌలురైతుల గుర్తింపుతో పాటు పంట రుణాల సమస్య మళ్లీ మొదటికి రానుంది. భూ ఆధార్‌తో కౌలు రైతులు తీరని నష్టాన్ని చవి చూడాల్సి వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలతో కౌలు రైతులకు జారీ చేసిన గుర్తింపు కార్డుల చెల్లుబాటు ప్రశ్నార్థకరంగా మారనుందని రైతు సంఘాల నాయకుల ఆరోపిస్తున్నారు. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 2,123 మంది కౌలు రైతులు ఉన్నారు. వారంతా సీసీఆర్సీ కార్డులు సైతం పొంది ఉన్నారు.


రుణాలు అందని ద్రాక్షే

భవిష్యత్తులో భూ ఆధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలని ఆర్‌బీఐ బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు ఉంటేనే బ్యాంకులు అరకొరగా రుణాలు ఇచ్చేవి. ప్రస్తుతం ఆర్‌బీఐ జారీ చేసిన ఆదేశాలతో కౌలు రైతులకు రుణాలు అందని ద్రాక్షగా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మేలు చేసేలా చట్టం తీసుకొస్తామని చెబుతుండడంతో దానికోసం వారంతా ఎదురుచూస్తున్నారు.

విశిష్ట సంఖ్య నమోదుకు చర్యలు

భూ యజమానికి విశిష్ట సంఖ్య జారీ చేయాలని ఆదేశించడంతో వ్యవసాయ శాఖ ఆఘమేఘాలపై చర్యలు చేపట్టింది. రైతు సేవ కేంద్రాల్లోని వీఏఏల వద్దకు భూ యజమాని ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్ ,ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబర్ తీసుకుని వెళ్తే వారు ఫార్మర్ రిజిస్ట్రీలో ఓనర్‌షిప్‌ను నిర్ధారించి వారికి 11 అంకెల నంబర్‌ను కేటాయిస్తున్నారు. వీటిలో సాంకేతిక సమస్యలు తలెత్తితే రెవెన్యూ శాఖ రికార్డులను సరిచూసి వారికి నంబర్‌ను కేటాయిస్తారు. కేంద్రం డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో రైతుల వివరాలను డిజిటలైజేషన్ చేయాలని భావించడంతో సన్న, చిన్న కారు రైతులతో పాటు కౌలురైతుల భవిష్యత్తుపై గొడ్డలి వేటు వేసి కార్పొరేట్ శక్తులకు అండగా ఉండేందుకు పావులు కదుపుతోందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కౌలురైతులకు అందజేయాలి



భూ ఆధార్‌తో కలిగే ప్రయోజనాలు కౌలు రైతులకు కూడా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. భూ ఆధార్‌తో కౌలు రైతుల గుర్తింపునకు గండిపడేలా ఉంది. క్షేత్రస్థాయిలో పంటల సాగులో కౌలు రైతుల కష్టాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి మేలు చేసేలా చట్టాలు తీసుకురావాలి.

–దత్తాత్రేయ, కౌలురైతు, అయ్యవారిపల్లి


కౌలుదారులకు తీరని నష్టం



వాస్తవానికి 70 నుంచి 80 శాతం మంది కౌలు రైతులే క్షేత్రస్థాయిలో పంటలను సాగు చేస్తున్నారు. భూ ఆధార్‌ను యజమానులకు జారీచేసి కౌలు రైతులకు తీరని నష్టం చేసేలా ప్రభుత్వాలు పన్నాగం పన్నాయి. డిజిటల్ అగ్రిమిషన్‌ను రాష్ట్రంలో అమలు చేయడం సరైన నిర్ణయం కాదు. ఈ ప్రక్రియతో కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది

–కాకు. వెంకటయ్య, రైతు సంఘం జిల్లా నాయకుడు

ఆదేశాలు రాలేదు



కౌలు రైతులకు సంబంధించి భూ ఆధార్ జారీపై ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుంది. ప్రస్తుతానికి ఉదయగిరి సబ్ డివిజన్‌లోని 40 శాతం మంది పట్టాలు కలిగిన రైతులకు విశిష్ట నంబర్‌ను జారీ చేశాం. మిగిలిన వారికి కూడా నిర్ణీత గడువులోగా భూ జారీ చేస్తాం. రైతులు వీఏఏలను సంప్రదించి తగిన పత్రాలను అందజేస్తే వెంటనే నంబర్‌ను జారీ చేస్తున్నాం.

– చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి



ట్రాక్టర్ల సాయంతో నీటిని తరలిస్తున్న దృశ్యం

సాగునీటికి రైతుల పాట్లు

దుత్తలూరు: మార్చి సమీపించడంతో ఎండలు మండిపోతున్నాయి. దీంతో రేగడి నేలల్లో తేమ ఆవిరై పొగాకు పంట ఎండుముఖం పడుతోంది. పంటను కాపాడుకునేందుకు రైతులు సాగునీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. సుదూరంగా ఉన్న సాగునీటి వనరుల్లోని అరకొర నీటిని డీజిల్ ఇంజిన్లు, ట్రాక్టర్ల సాయంతో పైపుల ద్వారా తరలించి అందిస్తున్నారు. ఆయిల్ ఇంజన్లు, పైపుల బాడుగలు, కూలీల ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతోందని రైతులు చెబుతున్నారు. ధరలు బాగుంటే తమ కష్టానికి ప్రతిఫలం దక్కుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పొగాకు పంటకు నీరు పెడుతున్న కూలీలు